# శోధించీ సాధించాలి...

"నేనెవర్ని" అని ప్రశ్నించుకోవలసిన పరిస్థితి ప్రతి ఒక్కరికీ కాకపోయినా కొందరికి ఎప్పుడో ఒకప్పుడు ఎదురవుతుంది.

"నేను ఇలా ఎందుకున్నాను" అనీ ప్రశ్నించుకోవలసిన పరిస్థితీ ఎదురవుతుంది.

"నేను ఇలా కాకుండా మరోలా ఉండాలా" అనీ ప్రశ్నించుకోవలసిన సమయం ఆసన్నమవుతుంది.




ఇలాంటి ప్రశ్నలు వేసుకుని వాటికి సమాధానాలు చెప్పుకున్న వాళ్ళున్నారు. అలాంటి వాళ్ళ కారణంగానే తాత్విక దృష్టి వచ్చింది. అయితే, అది ఒకే దృష్టికాదు. వారి వారి ఆలోచనా పరిధుల మేరకు భిన్న దృష్టులు ఏర్పడ్డాయి.

"నేనెలా పుట్టాను" అనే పశ్న నుంచి సృష్టి రహస్యాలు తెలిశాయి. దేవుడే సమస్త ప్రాణుల్నీ సృష్టించాడని కొందరు చెప్పారు. ఇప్పటికీ ఈ మాటను నమ్మేవాళ్ళున్నారు.

స్త్రీ పురుషుల కలయిక వల్ల సంతానం కలుగుతుందని కొందరు అన్నారు. స్త్రీ పురుషులు కలిసినందువల్లే సంతానం కలగదనీ, వారి సంయోగ సమయంలో బీజం, క్షేత్రం కలిస్తేనే సంతానయోగం ఉంటుందనీ ఆ తర్వాత ధ్రువీకరించారు. ఈ మాట చెప్పడానికి పరిశోధన అవసరమయింది.

మానవ జాతి మనుగడలో ఎన్నో అనుభవాల సారం ఉంది. మరెన్నో పరిశోధనల సారాంశం ఉంది. ఆ కారణంగానే అనాగరిక సమాజం నుంచి నాగరిక సమాజానికి రాగలిగాం.

అందరూ అన్నీ చెయ్యలేరు. ఎవరో కొందరు నిద్రాహారాలు మాని, సామాన్య సుఖ సంతోషాల స్వార్థం వదలి అందరి కోసం పరిశోధనలు చేసి, ఓ మార్గం చూపితే, అందులోకి మిగతా అందరూ నడుస్తారు. కొందరి త్యాగం ఎందరికో భోగం అవుతుంది.

బానిస బతుకుల అతుకుల గతుకులు చూసి, భగభగ మండిన హృదయంతో స్పార్టకస్ తిరగబడినందువల్లే ఆ స్పృహ ఇతర బానిసలకు కలిగింది. 'తరతరాలుగ కొలువు తీరిన తారతమ్యపు కోటగోడలు పగులగొట్టగల ప్రజాశక్తులు పల్లవించాలి' అని మార్క్స్ ఆలపించిన సమతా గీతం ఎన్నో దేశాల శ్రమజీవుల్ని సమైక్యపరిచిరెది. విప్లవాలు తెచ్చింది.

ఎవరు ఏ యుద్ధం చేసినా తమ మాతృభూమి కోసమే చేశారు. పరాయి దేశాన్ని ఆక్రమించుకోవాలని కొందరు రాజులు చేసిన యుద్ధంలో కూడా మాతృభూమి భావనతో యుద్ధం చేసిన సైనికులే ఎక్కువ.

కన్న తల్లిని మించినదేదీ ఈ ప్రపంచంలో లేదని నమ్మినందువల్లే తాము పుట్టి పెరిగిన భూమిని మాతృభూమి అన్నారు. కన్నతల్లిని ప్రేమించలేనివాడు మాత్రమే మాతృభూమిని ప్రేమించలేడు. కన్న తల్లిని ప్రేమించే వాళ్ళంతా కన్న ఊరిని మరచిపోలేరు. కన్న తల్లి మీద కమనీయ కవితలల్లినట్టే కన్న ఊరి మీదా కథలు కట్టారు.

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

"నా జన్మభూమి ఎంత అందమైన దేశము" అంటూ మురిసిపోతూ పాటలు పాడారు. మాతృభూమిని వదిలి భుక్తికోసమో, రక్తికోసమో పరాయి దేశం వెళ్ళినా తమ మాతృభూమిని మరచిపోలేని వాళ్ళెందరో ఉన్నారు. అందువల్లే, " ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" అని గొంతెత్తి పాడారు.

వరదలొచ్చి, తుపానులొచ్చి, తమ వరి పొలాలూ అరటి తోటలూ ధ్వంసం అయిపోయినా, ఆ కష్టనష్టాలను తట్టుకుంటూ కన్న ఊరినే నమ్ముకుని బతుకుతున్న వాళ్ళెందరో. అలాకాకుండా బతుకుతెరువు కోసం పట్నాలు వెళ్ళినా తమ ఊరు ఎందరినో వెన్నాడుతుంటుంది. పచ్చని పొలాలూ చెట్లూ చెరువులూ పిల్లకాలువలూ తరచూ పలకరిస్తుంటాయి. పట్నవాసపు హడావుడినీ, కాలుష్య జీవనాన్నీ పరిహసిస్తుంటాయి.

కన్నతల్లిని చూడాలనిపించినట్టే కన్న ఊరినీ చూడాలనిపిస్తుంది. తమ ఊరిలోని చిన్ననాటి స్నేహితుల్నీ బంధువుల్నీ కలవాలనిపిస్తుంది. తమ ఊరు దగ్గరగా ఉంటే తరచూ వెళ్ళిరావచ్చు. కొంతదూరంలో ఉంటే అప్పుడప్పుడూ అయినా వెళ్ళిరావచ్చు.

కానీ.....

ఏనాడో, ఏ వందేళ్ళ క్రితమో తమ ముత్తాతలో, ఆ ముత్తాత తాతలో భుక్తికోసం పేదరికపు భూతం భయంతో ఏ ఓడమీదో మాతృభూమిని వదలి పరాయి గడ్డమీదకెళ్ళి, అక్కడ మళ్ళీ చిరుబతుకే అయినప్పటికీ కొత్త బతుకును ప్రారంభించి, వెనుదిరిగి వెళ్ళాలని ఉండి డబ్బులేక వెళ్ళలేకపోతే... ముత్తాతలు చనిపోయి, తాతలో తండ్రులో మన సొంత ఊరు ఫలానా దేశంలో, ఫలానా జిల్లాలో ఉందని చెబితే, తమ మాతృభూమిని చూడాలనిపిస్తే... తమ ఊరు వందేళ్ళ తర్వాత కూడా అదే పేరుతో ఉందో లేదో...తమ తాతముత్తాల్ని ఎరిగిన వాళ్ళింకా ఆ ఊర్లో ఉన్నారో లేదో అనే అనుమానం వచ్చి తమ కన్న ఊరికి రావడానికి వెనుకడుగేసే వాళ్ళుంటారు.

అప్పుడు, తమ సోదర మానవుల ఆశల్నీ నిరాశల్నీ చదివిన వాడెవడో పరిశోధనకు పూనుకుంటాడు.

రాహుల్ సాంకృత్యాయన్ ఎంతో పరిశోధన చేసి, ఓల్గా సే గంగా వంటి నవలలు రాశాడు. సాంస్కృతిక, మానవ జీవన మూలాల్ని వెదికాడు. తన నీగ్రో మూలాల్ని తెలుసుకోడానికి దక్షిణాఫ్రికా మారుమూల ప్రాంతాలు తిరిగి ఏడుతరాల్ని తెలుసుకుని ఒక గొప్ప నవలగా 'రూట్స్'ను అలెక్స్ హేలీ మలిచాడు.

ఈ మధ్య ట్రినిడాడ్ అండ్ టిబాగో ప్రొఫెసర్ షంషుద్దీన్ బీహార్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలోని మారుమూల పల్లెలు తిరిగి తన ప్రస్తుత దేశంలోని అనేక మంది భారతీయుల సొంత ఊళ్ళనూ బంధు వర్గాన్నీ గుర్తుపట్టాడు. వందేళ్ళ క్రితం ట్రినిడాడ్ వెళ్ళి, అక్కడే ఉండిపోయిన భారతీయులకు సంబంధించిన జనరల్ రిజిస్టర్, వివిధ ఎస్టేట్‌ల రిజిస్టర్లు, షిప్ రిజిస్టర్ల సాయంతో ఆయనీ పనికి పూనుకున్నాడు. ఈ పరిశోధన షంషుద్దీన్ తపన, తృష్ణవల్ల విజయవంతమయింది. వంశవృక్షాలు తయారు చేశాడు. దాంతో ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని వాసుదేవ్ పాండే ఉత్తరప్రదేశ్‌లోని అజంగడ్ జిల్లాలో ఉన్న తన పూర్వీకుల కన్న ఊరు లచ్మన్‌పూర్‌ను ఇటీవల వెళ్ళినప్పటి ఆనందాన్ని వాసుదేవ్ పాండే కూడా పొందే ఉంటాడు. ఆ సంతోషాన్ని ఆయనికిచ్చింది షంషుద్దీన్ నిరంతర పరిశోధన. మహాకవి శ్రీశ్రీ అన్న మాట ముమ్మాటికీ నిజం-

"శోధించి సాధించాలి, అదియే ధీరగుణం".

వార్త దినపత్రిక, 14.2.97